క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రాజు



దుగ్గొండి: నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా దేశాయిపల్లికి చెందిన కొల్లూరి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి బుధవారం నియామాకపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మాధవరెడ్డి గెలుపునకు విశ్రమించకుండా కృషి చేస్తామన్నారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు

ఖానాపురం : గుడుంబా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ రమేష్‌చంద్ర అన్నారు. మండలంలోని బోటిమీది తండాలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గుడుంబా తయారీ, విక్రయదారులపై పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి, స్థానిక ఎస్సై మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన ఆత్మ డైరెక్టర్ ముత్యాల సాంబయ్య, ఇల్లందకు చెందిన ఓ దినపత్రికలో పనిచేస్తున్న గడ్డల సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఇద్దరు సైతం కోమాలో ఉండగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆయన కోరారు.

చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేటకు చెందిన హంస ఉప్పలమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి గుండాల మదన్‌కుమార్ బుధవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం



వర్ధన్నపేట : తమ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పోలీస్ ఉద్యోగాల్లో ఎంపికకాగా వారిని బుధవారం ఆ పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని ఇల్లందలోని కాకతీయ పాఠశాలలో చదివిన అదే గ్రామానికి చెందిన నలుగురు పూర్వ విద్యార్థులు శ్రీరామోజీ విజయకుమార్, బొంతల నితిన్, మైదం రమ్య, జన్ను సంధ్యారాణిలను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగి గురువులకు, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదాశివుడు, కోదాటి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా విజయరామరాజు

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన హంస విజయరామరాజును ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు మండల ఇన్‌చార్జ్ రాయిడి రవీందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలకు విజయరామరాజు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పాలన సీఎం కేసీఆర్‌కే సాధ్యం

వర్ధన్నపేట : రాష్ట్రంలో సంక్షేమ పాలన కేవలం సీఎం కేసీఆర్‌కే సాధ్యపడుతుందని మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి అన్నారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి పథకాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, ఎలికట్టె యాకయ్య, తిరుపతి సురేష్, సుధాకర్, కాంతం, సోమయ్య, ఆనందం, నరేందర్, సుభాష్, ఆరోగ్యం, గాలిబ్, సుమన్, సోమయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పర్వతగిరి : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పర్వతగిరి: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని మంత్రి నివాసంలో బుధవారం పాలకుర్తి మండలం ముత్తారం గుట్టకిందతండాకు చెందిన బంజారా నాయకులు పది మంది, లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన, తొర్రూరు మండలం కంఠయపాలెంకు చెందిన పది మంది కాంగ్రెస్ నాయకులు, తొర్రూరు మునిసిపాలిటీ 5వ వార్డు దుబ్బతండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పెర్కవేడులో బీఆర్ఎస్ నేతల ప్రచారం

రాయపర్తి: మండలంలోని పెర్కవేడులో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ మందాడి సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ బండి అనూష రాజబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, వెంకటాచారి, డైరెక్టర్ కుల్ల వెంకన్న, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి



నర్సంపేట : కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండలంలోని మగ్దుంపురం బీఆర్ఎస్, బీజేపీల నుంచి 70 కుటుంబాలు, రాజేశ్వర్‌రావుపల్లిలో 11 కుటుంబాలు, నల్లబెల్లి మండలం రుద్రగూడెంలో 12 మంది, ఖానాపురం మండలం అశోక్‌నగర్ శివారు వడ్డెరగూడెంకు చెందిన 20 కుటుంబాలు, ధర్మారావుపేటలో 11కుటుంబాలు దొంతి సమక్షంలో చేరారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని నర్సంపేట మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని 21, 22, 23డివిజన్లలో బుధవారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరించారు.కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి, ఉపాధ్యక్షులు వేముల సారంగం, మాజీ వార్డు మెంబర్లు రమేష్, సాంబయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పట్టణ మహిళా అధ్యక్షురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : పల్లెలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ముగ్దుంపురంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ చందావత్ తిరుపతినాయక్, బీజేపీ నాయకులు చల్లా రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేతలు గుడిపూడి రవీందర్ ఆధ్వర్యంలో 78 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముగ్దుపురం గ్రామశాఖ అధ్యక్షుడు వరంగల్ కుమారస్వామి, ఎంపీటీసీ స్వరూప ఓదయ్య, సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: జాతీయ పార్టీ కాంగ్రెస్ వస్తే అందరికి మేలు జరుగుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని దీక్షకుంట, వెంకటాపురం, చిన్నకొర్పోలు గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృత ప్రచారం చేపట్టారు. పలువురు బీఆర్ఎస్, బీజేపీలకు రాజీనామా కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఉన్నారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రామానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శివకుమార్,పాల్గొన్నారు.

ఖానాపురం: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. అశోక్‌నగర్‌లో నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. శ్రీనివాస్, యాకయ్య, సారంగపాణి, జగన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మినీ డీసీఎం బోల్తా... తప్పిన ప్రమాదం

నర్సంపేట రూరల్: మినీ డీసీఎం బోల్తాపడిన సంఘటన మండలంలోని లక్నెపల్లి శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..హన్మకొండ నుంచి ఒడిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరికి మినీ డీసీఎం కోడిగుడ్ల లోడుతో బయలు దేరింది. మండలంలోని లక్నెపల్లి శివారుకు డీసీఎం చేరుకోగా టైర్ పగిలిపోవడంతో డీసీఎం బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న కోడిగుడ్లు పగిలిపోయాయి. సుమారు రూ.60వేల నష్టం వాటిల్లింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలి

రాయపర్తి: బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి లేగ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం మండలంలోని పెర్కవేడు, సూర్యతండా గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, నూనె అనిల్, ఎనగందుల శ్రావణ్‌కుమార్, అబ్బోజు సుధాకర్, గారె అశోక్, గణేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాన్ని తొలగించాలి



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లిలోని మూడో వార్డులో సీసీ రోడ్డును ఇటీవల పోశారు. కాని మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సంగెం : బీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే చల్లా

సంగెం: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాపులకనిపర్తికి చెందిన వేల్పుల రాజేష్, వర్కాల సతీష్, జిట్టా శివ, జన్ను సుమన్, కార్తీక్ మారెపల్లి రాకేష్, సదిరం భరత్, శశికుమార్, సాగర్, సమ్మయ్య, శ్రీను, ఎర్ర ప్రవీణ్, సది. కందిక రాజేష్‌లు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో హన్మకొండలోని చల్లా నివాసంలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, ఎంపీటీసీ బాలకృష్ణ, గ్రామశాఖ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిని గెలిపించడానికి యువత పాత్ర ఎంతో కీలకమని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేట, నల్లబెల్లి, పల్లారుగూడ, వంజరపల్లి గ్రామాల్లో యూత్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కక్కెర్ల కుమారస్వామి, నాయకులు అనిల్, శ్రీనివాస్, రంజిత్, సంజీవ, నాగేంద్రబాబు, నాగరాజు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'చల్లా'కు హ్యాట్రిక్ విజయం అందించాలి

గీసుకొండ: పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి హ్యాట్రిక్ విజయం అందించడానికి ప్రతీ బీఆర్ఎస్ యూత్ కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు సిరిసె శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం గీసుకొండలో బీఆర్ఎస్ యూత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు జయపాల్‌రెడ్డి, అనిల్, దళితబంధు చైర్మన్ కోట ప్రమోద్, సోషల్ మీడియా కన్వీనర్ జూలూరి లెనిన్ గౌడ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని యువత పరకాల ఎమ్మెల్యేచల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఆయనను మరో మారు గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు సుంకరి శివ అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ డివిజన్, గోలి రాజయ్య, బాబు, రాజు, సందీప్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

- వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్ నాగరాజు



పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఆర్ నాగరాజు

పర్వతగిరి : కాంగ్రెస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని కల్లెడకు చెందిన ముదిరాజ్ కులస్తులు భువనగిరి దుర్గేష్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు బుధవారం నాగరాజు సమక్షంలో చేరారు. కార్యక్రమంలో ఎల్లమ్మ, సుజాత, కౌసల్య, వీరయ్య, శ్రీను, ఓదయ్య, పాల్గొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రచారంలో పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, జాటోతు శ్రీనివాస్‌నాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు కూసం రామచందర్, నాయకులు బొట్ల కనకరాజు, సురేందర్‌రావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చింతనెక్కొండలో ఎన్నికల ప్రచార రథాన్ని బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ ప్రారంభించారు. గోపనపల్లి, చౌటపల్లి, చింతనెక్కొండ, తూర్పుతండా, పర్వతగిరి, బూరుగుమడ్ల, వాల్యతండా గ్రామాల్లో ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గొడుగు భిక్షపతి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, పర్వతగిరి టౌన్ అధ్యక్షుడు కూసం రామచందర్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డగా వస్తున్నా.. ఆశీర్వదించండి

- పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి



పార్టీలో చేరిన కార్యకర్తలతో యశస్వినిరెడ్డి

రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించాలని కాంగ్రెస్ అభ్యర్థి అనుమాండ్ల యశస్వినిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి, వాంకుడోతుండాల్లో కాంగ్రెస్ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సిరెడ్డితో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదరించి గెలిపిస్తే ఐదేళ్లు మీకు సేవ చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ స్కీంలు ప్రజల అభివృద్ధికి పాటుపడతాయన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, పోతిరెడ్డిపల్లి గ్రామపార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, సర్పంచ్ లకావత్ సమ్మక్క భాస్కర్, దేవేందర్, శ్రీను, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక...

మండలంలోని సన్నూరుకు చెందిన బీజేపీ ఎస్టీసెల్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిక్షంనాయక్, ఉద్యమకారుడు సంతోష్‌నాయక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



ఖానాపురం : ప్రచారం చేస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

నర్సంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి మరోసారి అధిక మెజార్టీతో గెలిపించడమే కార్యకర్తల లక్ష్యమని 1వ వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమలసదానందం, వార్డు ఇన్‌చార్జి గోనె యువరాజు అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రాజేష్, యూత్ అధ్యక్షుడు కుసుంభ నిరంజన్, ఎండి.జమాలుద్దీన్, పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షుడుఎండి.అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 10వ వార్డులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చెన్నారావుపేట: ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు పనిచేయాలని మండల ఇన్‌చార్జ్ రాయిడి రవీందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పత్తినాయక్‌లు అన్నారు. మండలంలోని లింగాపురం, కోనాపురం, బోజేర్వు, అమీనాబాద్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఖానాపురం:బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం బుధవారం చేపట్టారు. ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్యల ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగించారు.

దుగ్గొండి: నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిని బేరీజు వేసుకున్న యువత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికే మద్దతు పలుకుతుందని బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని మదిర, చాపలబండ గ్రామాల్లో బుధవారం సాయంత్రం యూత్ మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, పిండి కుమారస్వామి, ఉమేష్‌రెడ్డి, ముత్యాలస్వామి యూత్ కమిటీల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కాజేసిన పంచాయతీ కార్యదర్శి

- బాధితురాలి ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

నెక్కొండ : దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుపడుతున్న చందంగా ఓ వితంతు పింఛనుదారు ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని పత్తిపాకలో బుధవారం చోటు చేసుకుంది. వ్యవసాయ కూలి చేసుకునే పింఛన్‌దారు చాగంటి యాకలక్ష్మి భర్త నర్సయ్య అనారోగ్యంతో 10 నెలల క్రితం మృతి చెందాడని తెలిపింది. పింఛను కోసం అటు ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగానని పేర్కొంది. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రాకేష్‌ను అడుగగా పింఛన్ రాలేదని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారన్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలనెలలు గడుస్తున్న పింఛన్ రాదాయేనని ఆమె విలపించింది. తోటి పింఛనుదారుల తనకు పింఛన్ వస్తోందని చెప్పారని ఆమె తెలిపింది. దీంతో తన కుమారుడు దేవేందర్‌కు చెప్పగా పింఛన్ స్టేట్‌మెంట్ తీయగా ఈ ఏడాది ఫిబ్రవరిలో మంజూరైనట్లు తేలిందన్నారు. పింఛన్ మంజూరీ పత్రాలను విలేకరు ముందుంచింది. తనకు చదువు రాదని తెలిసి కార్యదర్శి పింఛను డబ్బులు నొక్కారని ఆమె ఆరోపించింది. దీంతో కార్యదర్శిని నిలదీయగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల డబ్బులు మాత్రమే ఇచ్చారని ఆమె పేర్కొంది. మిగతా డబ్బులు అడిగితే తనకు సంబంధం లేదని కార్యదర్శి చెప్పుకొస్తున్నాడని వివరించింది. మిగతా నెలల పింఛను ఇప్పించాలని అధికారులను ఆమె కోరింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. కార్యదర్శిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. ఈ విషయమై ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి రాకేష్‌లను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

నల్లబెల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. పోలీసులు కథనం వివరాల ప్రకారం.. మండలంలోని బజ్జుతండాకు చెందిన తేజావత్ పరమేశ్ వెంకటేష్, భూక్య రాకేష్, కిషోర్‌లు ఒకే గ్రామానికి చెందిన వారు కాగా సమీప బంధులు కావడంతో మంచి స్నేహబంధాలు ఉన్నాయి. పరమేష్, రాకేష్‌లు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వెంకటేష్, కిషోర్‌లు హన్మకొండలో చదువుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరుపుకునేందుకు వారు హైదరాబాద్, హన్మకొండ ప్రాంతాల నుంచి స్వగ్రామానికి అక్టోబర్ 21న వచ్చారు. రాత్రంతా సంతోషంగా గడిపారు. తెల్లవారుజామున నిద్రపట్టడంలేదని పరమేష్, వెంకటేష్, రాకేష్‌లు ద్విచక్రవాహనంపై నల్లబెల్లికి బయలుదేరారు. రుద్రగూడెం శివారులో జాతీయ రహదారి మూలమలుపు వద్ద అతివేగంగా వెళ్లగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరమేష్ మృతి చెందిన విషయం విదితమే. వెంకటేష్, రాకేష్‌లు తీవ్రగాయాలు కాగా తేజావత్ వెంకటేష్(22) నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

నర్సంపేటలో మహిళ ..

నర్సంపేట రూరల్ : పాము కాటువేయగా చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.ఆయన కథనం మేరకు పట్టణంలోని వల్లబ్‌నగర్‌కు చెందిన తోట రమ (55) కూలి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. అక్టోబర్ 30న కూలి పని ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చి పొయ్యి అంటించేందుకు ఇంటి ఆవరణలోని కట్టెలు తీస్తుండగా పాముకాటు వేయడంతో కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యకోసం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ రమ బుధవారం మృతి చెందింది. మృతుడి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



గీసుకొండ : మండలంలోని జాన్‌పాకకు చెందిన చింతల రఘు(28) భార్యతో గొడవపడి వారం రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ఫిర్యాదు మేరకు గీసుకొండ పోలీసులు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నన్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



నల్లబెల్లి: ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నర్సంపేట రూరల్ సీఐ పుల్యాల కిషన్ అన్నారు. మండలంలోని రుద్రగూడెం, గాంధీనగర్, గుండ్లపాహాడ్ గ్రామాల్లో కేంద్ర పోలీస్ సాయుధ బలగాలు, నల్లబెల్లి పోలీసులు సంయుక్తంగా బుధవారం కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులకు సాయంగా కేంద్ర బలగాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై నగేష్ పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



సంగెం : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ యూత్ నాయకులు

సంగెం/పర్వతగిరి: మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల రమేష్ పిలుపునిచ్చారు. పిలుపు నిచ్చారు. బుధవారం సంగెం మండలంలోని నల్లబెల్లిలో మాదిగ యువత చైతన్య సమావేశంను నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల విశ్వ రూప మహాసభకు ప్రధాని మోదీ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో వేల్పుల దయాకర్, మామిడాల బాబు, భాస్కర్, సుధాకర్, హన్మకొండ కట్టయ్య, స్వామి, ఎండి.గౌస్, సుదర్శన్, అజయ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. పర్వతగిరి మండలంలోని కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంపత్, సుధాకర్, నరేందర్, ప్రవీణ్, యాకయ్య పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే మార్పు సాధ్యం'



బీజేపీలో చేరిన వారితో భిక్షపతి, విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాదరావు

సంగెం: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే మోలుగురి భిక్షపతి అన్నారు. బుధవారం మండలంలోని ఆశాలపల్లిలోని కూచన గార్డెన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహిళల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి కుటుంబాన్ని బాగుచేసుకున్న బీఆర్ఎస్‌కు ఈసారి బుద్ధి చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, రాజయ్య యాదవ్, మండల అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి బీజేపీలో చేరారు. బుధవారం ఆశాలపల్లిలోని కూచన గార్డెన్‌లో భిక్షపతి, విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాదరావు, సంతోష్‌కుమార్ సమక్షంలో చేరారు.